క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



వెంకటేశ్వర్లును పార్టీలోకి ఆహ్వానిస్తున్న పొదెం వీరయ్య

ఇల్లెందు: అసెంబ్లీ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (సింహం) గుర్తు మీద పోటీ చేసిన ఇల్లెందుకు చెందిన చీమల వెంకటేశ్వర్లు ఆదివారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య సమక్షంలో పార్టీలో చేరారు. పట్టణ, మండలాల కాంగ్రెస్ అధ్యక్షుడు దానియేల్, పులి సైదులు, దనియాకుల రామారావు, దేవా తదితరులు ఆయన వెంట రాగా భద్రాచలంలో పొదెం వీరయ్య కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రెండు దఫాలు టికెట్ ఆశించి భంగపడిన చీమల వెంకటేశ్వర్లు గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు.

కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా మంజుల



ఇల్లెందు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్లను ప్రకటించింది. ఇల్లెందు కోఆర్డినేటర్‌గా కాంగ్రెస్ పార్టీ కారేపల్లి మండల మాజీ అధ్యక్షురాలు పగడాల మంజులను నియమించింది. ఆదివారం ప్రకటించిన జాబితాలో ఇల్లెందుకు శ్రీకాంత్‌రెడ్డి, పగడాల మంజులను నియమించారు. ఎంపీ రేణుకా చౌదరి విధేయురాలుగా పని చేస్తున్న మంజులకు ఇల్లెందు నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా నియమించటం పట్ల కాంగ్రెస్ నేతలు పింగళి నరేష్, వడియాల చిట్టిబాబు, సుదర్శన్‌కోరీలు హర్షం వ్యక్తం చేశారు.

జరిమానా



జరిమానా రాస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం లేపాక్షి రోడ్డులో ఓ వైన్ షాపులో నిల్వ పదార్థాలు అమ్మిన వ్యక్తికి ఆదివారం మున్సిపల్ సిబ్బంది జరిమానా విధించారు. వివరాలు... వైన్‌షాపులో చికెన్, మటన్, చేప, ఇతర ఆహార పదార్థాలను అమ్ముతున్న వ్యక్తి, వాటిని నిల్వ చేసి అమ్ముతున్నాడని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ ఆదివారం వైన్ షాపుకు వెళ్లి అక్కడ అమ్ముతున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. అవి నిల్వ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో అమ్ముతున్న వ్యక్తికి జరిమానా విధించారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: వీధిలో కూర్చొని వచ్చిపోయే వారిని బూతులు తిట్టడమే కాకుండా ఒకరిపై రాయితో దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... మండల పరిధి సంగం గ్రామంలో శనివారం రాత్రి బొమ్మిడి నవీన్‌కుమార్ అదే గ్రామానికి చెందిన అప్పుల సురేష్‌ను అకారణంగా బూతులు తిట్టి గులకరాయితో తలపైకొట్టి గాయపరిచాడు. ఆదివారం బాధితుడి ఫిర్యాదు మేరకు నవీన్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

సుజాతనగర్: స్థానిక బొడ్రాయి సెంటర్‌లోని మర్రి చెట్టు నిలువునా ఎండిపోయి ఏ క్షణమైనా కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ చెట్టు కింద నుంచే స్థానికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. చెట్టు కింద ఉన్న విద్యుత్ లైన్ కూడా ఉంది. ప్రమాదం జరగముందే చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

భానుడి భగభగ..



- రోజురోజుకూ తీవ్రమవుతున్న ఎండలు
- వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరి
- బయటకు రావాలంటేనే జంకుతున్న జనం
- 44.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు



పాల్వంచరూరల్: నిర్మానుష్యంగా మారిన బీసీఎం జాతీయ రహదారి

సుజాతనగర్/పాల్వంచరూరల్: ఉదయం 9 గంటలకే భానుడు విశ్వరూపం చూపిస్తున్నాడు. జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. 43 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం బెంబేలెత్తుతున్నారు. సాయంత్రం 6 గంటల వరకు ఎండలు మండటంతో ఓ పక్క కష్టజీవులు, మరోపక్క మూగజీవులు మండుటెండలకు అల్లాడుతున్నాయి. రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వారం రోజులుగా ఎండలు తీవ్రరూపం దాల్చడంతో ఉపాధి కూలీలు ఎండలకు పనులు చేయలేకపోతున్నారు. దీంతో వారికి కూలి గిట్టుబాటు రాకపోడంతో నిరుత్సాహంతో ఉన్నారు. ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదు అవుతుండడంతో ప్రజలు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచిస్తోంది.

మండుటెండలో ప్రయాణికులకు తప్పని తిప్పలు...
రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సులకు ఆదరణ పెరిగింది. దీంతో పెద్ద ఎత్తున ప్రజలు బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. కానీ ప్రయాణికులు అవస్థలు పడకుండా కనీస సదుపాయాలు కల్పించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సుజాతనగర్ మండల కేంద్రంలో కనీసం బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నుంచి నిత్యం వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు నిత్యం వెళ్లి వస్తుంటారు. దీంతో వచ్చిపోయే క్రమంలో ప్రధాన సెంటర్ వద్ద గంటల తరబడి బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. ఎండకు, వానకు ప్రయాణికులు నిలబడేందుకు ఇక్కడ బస్ షెల్టర్ లేదు. ప్రయాణికులకు నీడ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి సదుపాయం కూడా లేక మహిళలు, పిల్లలు, వృద్ధులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పాల్వంచ మండల పరిధిలోని ప్రధాన జాతీయ రహదారితోపాటు, పెద్దమ్మగుడి వద్ద, గ్రామీణ ప్రాంతాల్లో కూడా జనసంచారం లేక వీధులన్నీ వెలవెలబోతున్నాయి.

ప్రభుత్వ కార్యాలయాల్లోనూ తాగునీరు కరువే...
ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీటి వసతి కరువై ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. తహసీల్, మండల పరిషత్ కార్యాలయాలకు ప్రజలు ఎక్కువగా వచ్చి వెళ్తుంటారు. ఈ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది కొరకు తాగునీటి వసతి ఉంది కానీ కార్యాలయాలకు ఆయా పనుల మీద వచ్చే వారికి మాత్రం తాగునీరు ఉండదు. దీంతో వివిధ పనుల మీద ఇక్కడికి వచ్చేవారు బయటకు వెళ్లి మంచినీళ్లు కొనుక్కుని తాగాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయాల్లో మిషన్ భగీరథ ట్యాప్‌ను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఎండల తీవ్రత ఇప్పడే ఇలా ఉంటే మేలో ఇంకెలా ఉంటుందోనని జనం భయాందోళనకు గురవుతున్నారు.

ఉక్కపోత తట్టుకోలేక..
నెల రోజులుగా సుజాతనగర్ మండలం, పాల్వంచ ఏరియా ఆరెంజ్ ఎలర్ట్‌లోనే కొనసాగుతోంది. గడిచిన 5 రోజులుగా ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే 23వ తేదీన 42.7 డిగ్రీలు, 24న 43.9 డిగ్రీలు, 25న 43.2 డిగ్రీలు, 26న 44.8, 27న 43.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తీవ్రమైన వడగాలులు, ఉక్కపోతతో మండల ప్రజలు అల్లాడిపోతున్నారు. ఫ్యాన్లు, కూలర్ల కింద కూర్చున్నా ఉపశమనం లభించడం లేదు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇదే పరిస్థితి ఉంటోంది. ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉంటున్నందున ఇంట్లో ఉన్నప్పటికీ వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

బస్ షెల్టర్ నిర్మించాలి..



సుజాతనగర్ మండల కేంద్రంలో వద్ద బస్ షెల్టర్ నిర్మించాలి. ఖమ్మం, కొత్తగూడెం, హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు బస్ షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కావడంతో ఎండలకు తట్టుకోలేక చెట్ల కింద నిలబడుతున్నారు. కనీసం తాగడానికి మంచి నీటి సౌకర్యం కూడా లేదు. అధికారులు స్పందించి బస్ షెల్టర్ ఏర్పాటు చేసి తాగు నీటి సౌకర్యం కల్పించాలి.

– గూని శ్రీనివాసరావు, సుజాతనగర్

ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి...



ప్రతీఒక్కరూ వడదెబ్బ తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. బయటకు వెళ్లినప్పుడు ఎండ నుంచి రక్షణకు ఏర్పాట్లు చేసుకోవాలి. తలనొప్పి, తీవ్ర జ్వరం, మగత నిద్ర, లేదా కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితి ఉంటే వడదెబ్బ లక్షణాలుగా గుర్తించి ప్రథమ చికిత్స అందించాలి. వైద్యం కోసం స్థానికంగా ఉన్న వైద్యశాలకు తరలించాలి.

– డాక్టర్ బి.రమేష్, ప్రభుత్వ వైద్యులు

రోడ్ షోను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న హరిప్రియ

ఇల్లెందు: మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షో మే 1వ తేదీన మహబూబాబాద్‌లో జరగనుందని, బీఆర్ఎస్ శ్రేణులు అత్యధికంగా తరలివెళ్లి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, దిండిగాల రాజేందర్‌లు కోరారు.

ఆదివారం రాత్రి ఇల్లెందు కరెంటాఫీస్ వద్ద బాలాజీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత గెలుపును కాంక్షిస్తూ చేపట్టిన రోడ్ షోలో అత్యధికంగా తరలివెళ్లి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు శీలం రమేష్, ప్రమోద్‌కుమార్, పరుచూరి వెంకటేశ్వరరావు, కృష్ణారావు, జబ్బార్, గిన్నారపు రాజేష్, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సీసీ రోడ్డు




రాంపురంతండాలో ప్రమాదకరంగా ఉన్న సీసీ రోడ్డు

జూలూరుపాడు: మండలంలోని గుండ్లరేవు గ్రామ పంచాయతీ రాంపురంతండా గ్రామంలో సీసీ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మించి ఏళ్ల గడుస్తున్నా సైడ్ సోల్డర్స్ పోయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అయిన అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా సైకిల్, బైక్, ఆటో, ట్రాలీ, కారు, ఎడ్ల బండ్లు నడిపితే ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇళ్లలో నుంచి రోడ్డుపైకి రావాలన్నా, రోడ్డు మీద నుంచి ఇళ్లలోకి వెళ్లాలన్నా ప్రతీరోజు ఒక సమస్యగా మారింది. సీసీ రోడ్డు కంటే డ్రెయినేజీలు కిందకు ఉన్నాయని, చిన్నారులు, వృద్ధులు, మహిళలు కిందపడి గాయపడుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డుకు సైడ్ సోల్డర్స్ ఏర్పాటు చేయాలని సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మెరిట్ విద్యార్థికి స్థానికుల సన్మానం



మహేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో పాపకొల్లు గ్రామానికి చెందిన సున్నం పిచ్చాచారి– నాగమణి దంపతుల కుమారుడు సున్నం మహేష్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఆదివారం పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వర స్వామి దేవస్థానంలో విద్యార్థి మహేష్‌ను ఆలయ చైర్మన్, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొదుమూరి కోటేశ్వరరావు, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ బానోత్ నవీన్ రాథోడ్, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధర్మరాజుల వెంకటనారాయణ, టీపీసీ జిల్లా ఉపాధ్యక్షుడు అరెగల నరసింహారావు, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి గుగులోత్ శ్రీనివాసరావు, కృష్ణార్జున్, దయాకర్, మహేష్ తండ్రి సున్నం పిచ్చాచారి పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఇల్లెందు: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ చంద్రన్న వర్గం అనుబంధ పీడీఎస్‌యూ జనరల్ కౌన్సిల్ సమావేశం శనివారం కొత్తగూడెంలో జరిగింది. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇల్లెందుకు చెందిన ఏ.సాంబను ఎన్నుకున్నారు. 15 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేయగా అందులో ఇల్లెందుకు చెందిన సాంబతో పాటు జె.గణేష్‌లకు రాష్ట్ర కమిటీ సభ్యులుగా స్థానం కల్పించారు.

పద్మశాలీ సంఘం అభివృద్ధికి కృషి చేస్తా..



ఎమ్మెల్యే కనకయ్యకు వినతిపత్రం అందజేస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు

ఇల్లెందు: నియోజకవర్గంలో అట్టడుగున ఉన్న పద్మశాలీలను ఆదుకోవాలని, వారికి చేయూతనిచ్చేందుకు సంఘం సభ్యులు కలిసికట్టుగా ఒకే సంఘంగా సాగాలని, ప్రభుత్వం తరుపున అనుకూలమైన సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం ఇల్లెందులోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పద్మశాలీ సంఘం సభ్యులు సమావేశంలో మాట్లాడారు. గడిచిన ఎన్నికల్లో పద్మశాలీలు తన గెలుపు కోసం కృషి చేశారని, ఎంపీ ఎన్నికల్లో కూడా ఇదే తరహా తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... గడిచిన మున్సిపల్, ఎమ్మెల్యే ఎన్నికల్లో పద్మశాలీల సహకారం లభించిందని, రానున్న ఎంపీ ఎన్నికల్లో ఇదే తరహా సహకారం అందించాలని కోరారు. పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోచికొండ సత్యనారాయణ మాట్లాడుతూ... పట్టణంలో 1500 కుటుంబాల పద్మశాలీలు ఉన్నారని తెలిపారు. మార్కెండేయ ఆలయం నిర్మాణం కోసం 400 గజాల స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్యను కోరారు. ఎలగందుల నారాయణ, దోమల శేఖరయ్య, మామిడి రమాకాంతం, సిరిమల్లె రమేష్, చిలువేరు రమేష్, డాక్టర్ రాచర్ల నరసయ్య, ఉరవకొండ ధనుంజయ, చెన్నూరి కృష్ణ, శ్రీనివాస్, బండారి వెంకన్న, బండారి శ్రీనివాస్, దోమల మహేశ్వర్, సిరిమల్లె రాజు, సిరిమల్లె నాగరాజు, పరిష రాధాకృష్ణ, జోగు సతీష్, కర్నాటి వెంకటరాజు, గోచికొండ సంజీవరావు, గోచికొండ ఈశ్వరరావు, రాహుల్ నేత, ఆడెపు సతీష్, రాయనర్సు, వంగర శంకర్, ఉమా, బైరి సుధాకర్, రామ్మూర్తి, పంతకాని రమేష్, రాధాకృష్ణ, గోచికొండ శ్రీదేవి, సిరిమల్లె పల్లవి, జడల విజయ, మాజీ కౌన్సిలర్ సామల రాధాశ్రీ, పేరాల విశాలక్ష్మి, కర్నాటి పద్మావతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాహనం తనిఖీ..
ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు రెండు రోజులుగా తనిఖీ కేంద్రాల్లో వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నారు. ఆదివారం ఇల్లెందు – కొత్తగూడెం రోడ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద వాహనాలకు తనిఖీ చేసిన అధికారులు అటుగా వచ్చిన ఎమ్మెల్యే కోరం కనకయ్య వాహనాన్ని ఆపి సోదా చేశారు.

వివాహం చేసిన మజీద్ పెద్దలు



వరుడితో ముస్లిం నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీలోని రామవరం 7వ వార్డు రాజేంద్రనగర్‌లో నివాసముంటున్న జం జం మజీద్‌లో ఇమామత్ చేస్తున్న హఫీజ్ మహమ్మద్ గౌసుద్దీన్ మౌలానా పేదింటి వధూవరులకు ఆదివారం వివాహం చేశారు. మహబూబాబాద్ వాస్తవ్యులు కీర్తిశేషులు ఇమామ్‌పాషా, రజీయాబేగం కూతురు షబానాను... గౌస్ కొంతకాలం చదివించి పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. ఈ శుభకార్యానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ మాట్లాడుతూ... సొంత కూతురుకు పెళ్లి చేయాలంటేనే ఎన్నో ఇబ్బందులు పడుతున్న ఈరోజుల్లో గౌసుద్దీన్ అందరికీ ఆదర్శంగా నిలిచారని, తల్లితండ్రులు లేని అమ్మాయిని పెళ్లి చేసుకోవడం ఎంతో గర్వకారణమని వారిని మన స్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎండీ సత్తార్ పాషా, మొయినుద్దీన్, రషీద్, రెహన్, సలీం పనామా, ఇస్మాయిల్, అఫ్జల్, అక్బర్ పాష, సోహెల్, క్రాంతి కుమార్, కోటేశ్వరరావు, పొట్టి కిరణ్, కలవల శ్రీనివాస్, రషీద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడికి ప్రత్యామ్నాయ చర్యలు



తోగు బావిలో పూడికతీత పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రస్తుతం తాగునీటి సరఫరా జరుగుతున్నప్పటికీ మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనికోసం మండలంలోని మొండితోగు గ్రామపంచాయతీ అధికారులు వందేళ్ల క్రితం బ్రిటీష్ అధికారులు తవ్వించిన తోగు బావికి పూడికతీత పనులను ఆదివారం ప్రారంభించారు.

2009లో ఇదే పరిస్థితి నెలకొన్న సమయంలో తోగు బావి నుంచి మొండితోగు గ్రామానికి ప్రత్యేకంగా పైపులైన్లు వేశారు. మిషన్ భగీరథ అందుబాటులోకి రావడంతో తోగు బావిని విస్మరించారు. కానీ ప్రస్తుతం నీటిఎద్దడి నివారణకు తోగు బావి పునరుద్ధరణ ఒక్కటే మార్గంగా భావించి ఉన్నతాధికారుల ఆదేశం మేరకు బావి పూడికతీత పనులు చేపట్టారు. పనులను గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి నిర్మల, కార్యదర్శి మోజెస్, గ్రామపెద్దలు పర్యవేక్షించారు.

16 టైర్ల లారీలు తెస్తే అడ్డుకుంటాం..



మాట్లాడుతున్న నరసింహారావు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టు పరిధిలో 16 టైర్ల టిప్పర్ లారీలను తెస్తే వాటిని అడ్డుకుంటామని టిప్పర్ అసోసియేషన్ నేలవెల్లి నరసింహారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం టేకులపల్లిలోని టిప్పర్ లారీ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేటీసీ నుంచి ఇల్లెందు సీహెచ్‌పీకి అతి తక్కువ ధరకు టెండరు పొందిన కాంట్రాక్టర్ 16 టైర్ల లారీల ద్వారా బొగ్గు రవాణా చేసేందుకు కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. స్థానికంగా ఉన్న 14 టైర్ల లారీలపై ఆధారపడి ఉన్న 10 వేల మందిని రోడ్డున పడేసేందుకు కాంట్రాక్టరు తన అర్థ, అంగబలాన్ని ఉపయోగిస్తున్నాడని విమర్శించారు. ఒక్క కాంట్రాక్టర్ కోసం పది వేల మంది ఆధారపడి జీవనం సాగిస్తున్న వ్యవస్థను నిర్వీర్యం చేయాలనుకోవడం చాలా దుర్మార్గమన్నారు. మా మనుగడే లేకుండా చేసే విధానాన్ని తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని స్పష్టం చేశారు. 16 టైర్ల లారీలు వస్తే తమకు చావే శరణ్యమని వాపోయారు. పది వేల మంది ఉపాధికి ప్రమాదం తెచ్చే విధానాన్ని ఎదుర్కొనేందుకు తామంతా సంఘటితంగా పోరాటం చేస్తామని ప్రకటించారు. తమ స్థానిక లారీలను, యూనియన్‌ను నిర్వీర్యం చేసే కాంట్రాక్టర్‌కు సింగరేణి అధికారులు టెండర్ ఇవ్వొద్దని కోరారు. సమావేశంలో వెంకటి, సురేష్, నరేష్, మోహన్, హనూ, రామారావు, వీరన్న, రవి, మల్లేష్ పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయండి



ఇల్లెందు: మాట్లాడుతున్న నబీ



టేకులపల్లి: కేటీసీలో మే డే వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: అంతర్జాతీయ కార్మిక కర్షక దినోత్సవం మే డేను ఘనంగా నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్‌ఏ నబీ తెలిపారు. ఆదివారం ఇల్లెందు కార్మిక అడ్డాల మీద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం సాగిన పోరాటంలో కార్మికులు చిందించిన రక్తంలో తడిచిన జెండా ఎర్ర జెండాగా మారిందన్నారు. 1886 మే 1న జరిగిన ఈ సంఘటన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా మే డేగా రూపాంతరం చెందినట్లు చెప్పారు. 138వ మే డేను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ, శంకర్, చందర్, దాసు, మోహన్‌రావు, కిరణ్, కిషోర్, సైదులు పాల్గొన్నారు.

టేకులపల్లి: 138వ మే డేను జయప్రదం చేయాలని, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) టేకులపల్లి ఏరియా కమిటీ ప్రధాన కార్యదర్శి రాయండ్ల కోటిలింగం పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కేటీసీలో 138వ మే డే పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. శ్రామికుల శ్రమను దోపిడీ చేస్తున్న పెట్టుబడి దారి సామ్రాజ్యవాద కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమించి ఎనిమిది గంటల పని విధానానికి కొట్లాడి తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించి ఎర్రజెండాను చేతికి అందించిన అమరవీరుల ఆశయాలకై ఈ మే డే వేడుకలను గ్రామగ్రామాన జరపాలన్నారు. కార్మిక హక్కుల కోసం కొట్లాడి తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించిన అమరవీరుల ఆశయాలను తుంగలో తొక్కి నేడు నరేంద్ర మోదీ ప్రభుత్వం నూతన కార్మికచట్టాలను, నూతన అటవీ సంరక్షణ నియమాలను, రైతాంగ వ్యతిరేక విధానాలను తీసుకొస్తూ కార్మికులను బానిసలుగా మార్చుతోందని, ఇందులో భాగంగానే 44 లేబర్ చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. నూతన యాంత్రీకరణ పేరుతో మ్యాన్ పవర్‌ను తగ్గిస్తున్నారని, కార్పొరేట్ శక్తులతో చేతులు కలిపి కార్మికవర్గాన్ని అణచివేస్తున్నారని విమర్శించారు. గిట్టుబాటు ధర అడిగినందుకు అనేకమంది రైతులను మోదీ పొట్టన పెట్టుకున్నారని, ఇదేనా ప్రజా సంక్షేమ పాలనా అని ప్రశ్నించారు. నూతన ఉద్యోగాలు లేకుండా చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చేస్తోందని, హిందూ ముస్లింల మధ్య కులమతచిచ్చు పెట్టి కాలాన్ని గడుపుతున్నారని, దేవుళ్ల పేరుతో రూ.కోట్లు ఖర్చు పెట్టే ఈ ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టే పరిస్థితిలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రక్తం మొత్తం ధారబోసి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని తుంగలో తొక్కేందుకు నేడు 12 గంటల పని విధానాన్ని అమలులోకి తీసుకొస్తోందని దీనిని వ్యతిరేకించాల్సిన బాధ్యత కార్మిక, కర్షక మేధావులు అందరికీ ఉందన్నారు. కార్యక్రమంలో డేగటి లాలయ్య, జి.శంకర్, కృష్ణ, వీరన్న, రామదాసు, భీమరాజు, దశరథ్, పాష, నరసయ్య, శ్రీనివాసు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వార్తా స్రవంతిని ఎందుకు నిలిపివేశారు?



సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం

సింగరేణి(కొత్తగూడెం): శ్రమకు, అంకితభావానికి మారుపేరుగా నిలిచిన సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం చేపట్టు కార్యక్రమాలు, నూతన గనుల ప్రణాళికలు, నూతన యంత్రాల కొనుగోళ్లు, సింగరేణి వ్యాప్తంగా జరుగుతున్న వివిధ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సేకరించి ప్రతి ఆదివారం టీవీలో మధ్యాహ్నం ఒంటి గంటలకు ప్రసారం చేసే సింగరేణి స్రవంతి కొంత కాలంగా నిలిచిపోయింది. ఇందుకు గల కారణం ఏంటి..? ఎందుకు నిలిపివేశారు..? అని కార్మికవర్గం చర్చించుకుంటోంది. గతంలో ఉన్న సింగరేణి ఎండీ ఏ కార్యక్రమం నిర్వహించినా.. లేదా పాల్గొన్నా ఆ కార్యక్రమాలను కార్మికులను చూపించిన ఈ చానల్ ప్రస్తుతం జాడ లేకుండా పోయింది. 2006లో ప్రారంభమైన ఈ సింగరేణి స్రవంతి కార్యక్రమాలు రాష్ట్రంలో ప్రభుత్వం మారినందుకా.. లేక సింగరేణిలో గుర్తింపు సంఘం మారినందుకా... సీఎండీ మారినందుకా.. అని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో సీఎండీ రాత్రనకా.. పగలనకా.. ఆస్పత్రులు, సూపర్ బజార్లతో పాటు ఇతర డిపార్ట్‌మెంట్లను తనిఖీ చేసి అందులో ఉన్న లోపాలను బయటికి తీస్తూ ఉద్యోగులను అలర్ట్ చేస్తున్నారు. అంతేకాకుండా కొన్నేళ్లుగా వార్షిక ఉత్పత్తిలో వెనుకంజలో ఉన్న సింగరేణి ఈ ఏడాది 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించినా.. వాటి గురించి వివరించే స్రవంతి కనుమరుగు అవటం పట్ల కార్మికవర్గం కలవరపడుతోంది. కారణం ఏదైనా సింగరేణి స్రవంతిని పునఃప్రారంభించాలని కార్మికవర్గం కోరుకుంటోంది. అంతేకాకుండా గతంలో సింగరేణి సమాచారాన్ని కార్మికులకు తెలిపేందుకు యాజమాన్యం పలు పత్రికలకు విడుదల చేసేది. అంతేకాకుండా ఒక నెలలో ఏప ఏరియాలో ఏమేమి కార్యక్రమాలు జరిగే కార్యక్రమాలకు సంబంధించిన వాల్ పోస్టర్లు వచ్చేవి. అవి కూడా ఇటీవల రావటం లేదనే విమర్శలు వెత్తుతున్నాయి. 2019లో కరోనా వచ్చిన నాటి నుంచి వాటిని మర్చిపోయారని, దీంతో సింగరేణిలో ఏం జరుగుతుందో కార్మికులకు తెలియటం లేదని, వివిధ ఏరియాల్లో ఉన్న కమ్యూనికేషన్ సెల్ అధికారుల నిర్లక్ష్యానికి, కార్పొరేట్ ఏరియాలో ఉన్న అధికార ప్రతినిధుల అలసత్వం తోడవడంతో గతంలో ప్రతీ మూడునెలలకు సింగరేణిలో జరిగే పలు విభాగాల అభివృద్ధి వారు చేసే కార్యక్రమాలను వివరించే నాథులు సింగరేణిలో లేకుండా పోయారని, సంస్థలోని ఉన్నతాధికారులు కింది స్థాయి (జీఎం)లకు ఎన్నిమార్లు చెప్పినా వారి మాట పెడచెవిన పెడుతున్నారనే వాదనలు సింగరేణి వ్యాప్తంగా వినపడుతున్నాయి. పైస్థాయి అధికారులు చెప్పిన విధంగా జీఎంలు నడుచుకుంటే కార్పొరేట్ కార్యాలయంలో డైరెక్టర్ల వద్దకు కార్మికులు వచ్చే పరిస్థితి సింగరేణిలో ఉండదని, వారి నిర్లక్ష్యం కారణంగానే డైరెక్టర్లు విజిట్‌కు వస్తే వారి వద్దకు విజిటర్స్ ఎక్కువగా వస్తున్నారని తద్వారా వారి సమయం వృథా అవుతుందనే వాదనలు సింగరేణి వ్యాప్తంగా వినపడుతున్నాయి.